నీటిని తోడేస్తున్నారు..

- వ్యవసాయం పేరిట బోర్ల ఏర్పాటు
- అక్రమ నీటి దందాకు ఇవే కారణం
- మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రాంతాల్లో కొందరి కాసుల కక్కుర్తి
- అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం
- వ్యాపారులతో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు

అసలే ఎండలు మండుతుంటే మరో వైపు భూగర్భ జలాలు ఎండిపోతున్న పరిస్థితి. దొరికిందే సందు అన్నట్లుగా మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కొందరు యథేచ్ఛగా అక్రమ నీటి దందా నడుపుతున్నారు. రాజకీయ అండ.. అధికారుల సహకారంతో మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా దందా సాగుతోంది. వ్యవసాయం పేరిట బోర్లు వేసుకొని ఈ వ్యాపారం సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సరూర్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రాంతాల్లో గల పలు ప్రదేశాల్లో అక్రమ నీటి దందా యథేచ్ఛగా నడుస్తోంది. స్థానికంగా రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు నేతలు, వారి అనుచరులు అక్రమ నీటి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయం పేరుతో బోర్లు వేసి, వాటి నుంచి భూగర్భ జలాలను తోడేస్తూ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ట్యాంకర్లు, ఆటోల ద్వారా హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, ఇతరత్రా కమర్షియల్ అవసరాలకు అక్కడి నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. జిల్లెలగూడ, మీర్‌పేట్‌లలోని ఐదారు ప్రదేశాల్లో ఈ దందా బహిరంగంగా కొనసాగుతోంది. దాంతో భూగర్భ జలాలు అడుగంటి, సమీపంలోని నివాస గృహాల్లో గల బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఫిర్యాదులు లీక్..

మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రాంతాల్లో విచ్చలవిడిగా జరుగుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల స్థానిక పలు కాలనీలకు చెందిన ప్రతినిధులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్ తదితరులకు ఫిర్యాదు చేశారు. కాగా సదరు ఫిర్యాదుల విషయం వెంటనే నీటి వ్యాపారులకు లీక్ అవుతున్నట్టు తెలుస్తోంది. ఫిర్యాదుదారులకు వారి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని సమాచారం. దీనిపై బాలాపూర్ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది. వారిపై తనతో దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కాగా తమతో తహసీల్దారే దురుసుగా వ్యవహరించారని, ఫిర్యాదులను రెవెన్యూ అధికారులే వ్యాపారులకు లీక్ చేస్తున్నారని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని గత శనివారం కలెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశార్నురు..



వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తరలిస్తున్న ట్యాంకర్లు, ఆటో (ఫైల్)





మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు గోవర్ధన్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి పొన్నంకు వీహెచ్‌పీఎస్ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ కోరారు. ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఐదు నెలలుగా సదరం క్యాంపులు నిర్వహించక, ప్రభుత్వం ఇస్తామన్న యూడీఐడీ కార్డులు ఇవ్వకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ ఆసుపత్రిలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నారని ఇది దూరమన్నారు. జిల్లాలోని 8 మండలాల దివ్యాంగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో కొండాపూర్, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిల్లో క్యాంపులు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరసింహచారి, సురేష్, ప్రవీన్ పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణ వేడుకల్లో రాంరెడ్డి తదితరులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 11(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గౌరెల్లి గుట్టలోని స్వామి 7వ వార్షిక ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొని తలంబ్రాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ నాయకుడు దండెం రాంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాంరెడ్డికి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. పెద్దఅంబర్‌పేట్ పరిధిలోని కేసరి గుట్టలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహించారు.



జాతీయ జెండాలతో వేణుగోపాలస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు

ఆలయంలో పూజలు

సరూర్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైనికుల క్షేమం కోరుతూ ఆదివారం బాలాపూర్‌లోని సంతాన వేణుగోపాల్ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ బడంగ్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. 3 గంటల వ్యవధిలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. భారత సైనికులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని, వారికి ప్రతి భారతీయుడు అండగా ఉంటాడన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు యాదగిరి, వీరకర్ణారెడ్డి, గౌర శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, రావుల మల్లేశ్, కె.అరవింద్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల భార్గవ్‌రెడ్డి, తిరుపతి సంతోష్, శ్రీనునాయక్, కొంతం ప్రకాశ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుల్జాభవానీ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కాలనీ నూతన కార్యవర్గం ఇదే

చంపాపేట, మే 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని తుల్జాభవానీ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాత్లావత్ శంకర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్‌రెడ్డి, కోశాధికారిగా నేనావత్ జీవన్‌కుమార్ నాయక్, ఉపాధ్యక్షుడిగా ఎస్.మురళీకృష్ణ, అనిల్, శంకర్, సహాయ కార్యదర్శిగా కె.జంగయ్య, లీగల్ అడ్వయిజర్లుగా బి.లక్ష్మీనాయక్, ఎం.శివకుమార్, నమ్యానాయక్‌లతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



కాలనీ వాసులతో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మన్సూరాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సహారా స్టేట్స్ రెండో గేటు వద్ద రూ.86.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణపు పనులను ఆదివారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. అనంతరం దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటరమణ, జేజే రెడ్డి, సయ్యద్ జానీ, మల్లికార్జున్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ అపురూపం

మన్సూరాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): ఈ భూ ప్రపంచంలో అమ్మను మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను దైవంలా పూజించాలని టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మదర్స్‌డేను పురస్కరించుకుని ఆదివారం నాగోల్‌లోని శ్రీఅక్షయ ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, టవల్స్ అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చందా భాగ్యలక్ష్మి, సేగు నలిని, కలకొండ మహిమాల, పోలా అర్చన, పద్మ, పద్మజ, స్వాతి పబ్బ, చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, చంద్ర సుధాకర్, సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హిమపురికాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని మాతృమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పోచబోయిన జగదీశ్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, గోపీకృష్ణారెడ్డి, బద్రి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, టవల్స్ అందజేస్తున్న శ్రీనివాస్

పార్కు స్థలాన్ని సంరక్షిస్తా

మన్సూరాబాద్ : కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని సంరక్షించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హిమపురికాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఆదివారం కాలనీని సందర్శించారు. కార్పొరేటర్ ప్రోత్సాహంతో కబ్జాకు గురైందని, వారి బారి నుంచి సంరక్షించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పోచబోయిన జగదీశ్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, గోపీకృష్ణారెడ్డి, బద్రి, రవికిరణ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చంపాపేట్ నివాసి ఎండీ. నజీర్ (60). మజీద్‌పూర్‌లో నివాసం ఉండే సునీల్ వద్దకు పెయింటింగ్ పని చేసేందుకు శనివారం వచ్చాడు. ఇదేరోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో షాప్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి పని ప్రాంతానికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని వారు దర్యాప్తు చేస్తున్నారు.



నజీర్



కాంగ్రెస్ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్ సోదరుడి కుమార్తె శృతి-నిఖిల్‌యాదవ్‌ల వివాహం కర్మన్‌ఘాట్‌లోని కొత్త కాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మధుయాష్కీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు.

-ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

కురుమ సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సభ్యత్వం నమోదు నిర్వహించి, బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరిపించాలి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం ఒంటెత్తు పోకడలను మార్చుకోవాలి. తన ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం మానుకోవాలి. 18 ఏళ్లకు సంబంధించిన సంఘం జమా ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి' అని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోశిక శ్రీనివాసరావు, నేతలు దేవర శ్రీనివాసరావు, గొరియ మల్లేశం, మధిరకృష్ణ,పెంటప్ప, నర్సింహ, దొడ్డు శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కోశిక శ్రీనివాసరావు అధ్యక్షతన కురుమ సంఘం సభ్యత్వం, సంఘం ఎన్నికలు, అధ్యక్షుడు యెగ్గే మల్లేశం ఒంటెత్తు పోకడలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధ్యక్షుడిగా కొనసాగుతున్న యెగ్గే మల్లేశం సంఘం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారని ఆరోపించారు. సంఘాన్ని తన సొంత ఆస్తిగా వాడుకుంటూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారు తప్ప సంఘం అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. ప్రశ్నించిన వారికి పదవులు ఇవ్వకుండా సంఘం నుంచి తొలగిస్తున్నారని వారు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన సభ్యత్వాన్ని చేపట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘానికి సంబంధించిన ఆస్తులు, ఇతర వివరాలను వెంటనే తెలియజేయాలని వారన్నారు. తమ డిమాండ్లపై ఆయన స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, వంశీకృష్ణ, భద్రీనాథ్, వంశీ, వీర్ల తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యెగ్గే మల్లేశంపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సంఘానికి చెందిన నాయకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలనాయకులు ప్రత్యారోపణలు చేశారు.



మాట్లాడుతున్న కోశిక శ్రీనివాసరావు తదితరులు

మల్లేశంపై తప్పుడు ఆరోపణలు తగదు

రాంనగర్: కురుమసంఘం అభివృద్ధి, కురుమల సంక్షేమం కోసం 20 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవచేసిన రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశంపై సంఘం ఉపాధ్యక్షుడు కోశిక శ్రీనివాస్‌రావు, మరికొందరు నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కొరె రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విభేదాలు ఉంటే సంఘంలో కూర్చుని మాట్లాడాలని, బయట మాట్లాడొద్దని ఆయన హితవు పలికారు.

వినియోగదారుల సంఘాల పనితీరు హర్షణీయం

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల భూముల పరిరక్షణపై వినియోగదారుల్లో చైతన్యంతోపాటు సరైన రీతిలో న్యాయపోరాటం చేసి భూముల పరిరక్షణలో తెలంగాణ వినియోగదారుల సంఘాలు ప్రథమ స్థానంలో ఉంటాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మండలి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి, నిజామాబాద్, మహబూబాబాద్, నెక్కొండ, తొర్రూర్, భద్రాద్రికొత్తగూడెం, నాగర్‌కర్నూల్, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ జిల్లాల వినియోగదారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మరోసారి దేవాలయ భూముల పరిరక్షణకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల న్యూఢిల్లీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు రెండురోజుల పాటు శిక్షణా తరగతులు జరిగాయన్నారు. తరగతుల అనంతరం కేంద్రప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల ముఖ్యకార్యదర్శి నిధి ఖరేతో సమావేశం జరిగిందని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మూడంచెల న్యాయవ్యవస్థ అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తున్నదని ఆమె వివరించారని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై గ్రామస్థాయిల్లో సైతం చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని వినియోగదారుల సంఘాలకు ఆమె సూచన చేశారన్నారు. వినియోగదారుల మండలి సభ్యులు ఎ.శివపార్వతి, పల్లెపాడు దామోదర్, అనంతశర్మ, ప్రీతిపాండ్య పాల్గొన్నారు.



రాణునాయక్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి

రాణునాయక్ విగ్రహావిష్కరణ.. సబితారెడ్డి హాజరు

సరూర్‌నగర్, మే 11(ఆంధ్రజ్యోతి): నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా గిరిజనుల(లంబాడాల) హక్కుల కోసం పోరాడిన వీరుడు జూటోత్ రాణునాయక్ విగ్రహాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె వచ్చారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాటి కమ్యూనిస్టులు చేసిన పోరాటానికి రాణునాయక్ నాయకత్వం వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో టీఎఫ్ ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ మంత్రి రవీంద్రానాయక్, మీర్‌పేట్ మాజీ మేయర్ దుర్గాదీప్‌లాల్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి, జె.శ్రీనునాయక్, ఇంద్రావత్ రవినాయక్, బంజారా సంఘం ప్రతినిధులు, పలువురు మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం

మాతృ దినోత్సవాన్ని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో బీఆర్ఎస్ మహిళా నేతలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి కేక్ కట్ చేశారు. మహిళలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

రేపు గ్రాండ్ మెగా జాబ్ ఫెయిర్

చాదర్‌ఘాట్, మే 11(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఇబ్నాట్ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 13న గ్రాండ్ మెగా జాబ్ ఫెయిర్-2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మలక్‌పేటలోని ఆఫీసర్స్ మెస్‌లో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు నిర్వహిస్తారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎన్ఎస్‌డీఐ, టామ్‌కామ్ (ఎంప్లాయిమెంట్ ఇన్ అబ్రాడ్)తోపాటు 50 ప్రైవేటు సంస్థలు ఉద్యోగాలు ఇస్తాయని నిర్వాహకులు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, బీఈ, బీటెక్ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాల కోసం 8125004111 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



న్యూ మారుతీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద వాటర్ కూలర్ ఏర్పాటు చేసిన కాలనీ ప్రతినిధులు

పాదచారుల కోసం వాటర్ కూలర్ ఏర్పాటు

కొత్తపేట, మే 11(ఆంధ్రజ్యోతి): పాదచారుల దాహార్తిని తీర్చడం కోసం వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. న్యూ మారుతీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం కాలనీ ప్రతినిధులు.. ఆధ్వర్యంలో చేపట్టారు. కాలనీ సంక్షేమ సంఘం వారు ఉచితంగా ప్రజల కోసం ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటెడ్ కోల్డ్ వాటర్ డిస్పెన్సర్‌ను పాదచారులు, వీధుల్లో కూరగాయలు, పండ్లు అమ్మే వారు, పారిశుధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కాలనీ అధ్యక్షుడు నీరంకి రవి కోరారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, నిర్వాహక కార్యదర్శులు ఎం.శంకర్, సంయుక్త కార్యదర్శి అరుణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్‌కృష్ణ, సలహాదారులు శంకర్‌రెడ్డి, సత్తయ్య, ప్రతినిధులు వాసు, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు అండగా ఉందాం : బీజేపీ

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రక్షణ, సమగ్రత కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా నిలబడడం మనందరి బాధ్యత అని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు ఇచ్చిన పిలుపుమేరకు సరిహద్దుల వద్ద పోరాడుతున్న సైనికుల విజయం, క్షేమం కాంక్షిస్తూ ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బీజేపీ డివిజన్ నేతలు రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, సురేష్‌రాజు, ఆనంద్ రావు, సత్యేందర్, రఘుయాదవ్, సాయి, తరుణ్, నీరజ్, శ్రీనివాస్, సంయుక్త రాణి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, పదో తరగతి మెరిట్ అవార్డులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని శిల్పా కల్చరల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ కాపర్తి ప్రకాష్ తెలిపారు. కొందరిని ఎంపిక చేసి మెరిట్ అవార్డులు, ప్రతిభా పురస్కారంతో సత్కరిస్తామని వివరించారు. ఈనెల 18వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 93470 57740 నెంబర్‌లో సంప్రదించాలని ప్రకాష్ సూచించారు.